మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట , జూలై 3 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ పట్నాయక్ సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంట వెంటనే నిర్మాణాలను ప్రారంభిస్తే దశలవారీగా డబ్బులు వారి వారి ఖాతాల్లో జమ అవుతాయని, ఆలస్యం చేస్తే డబ్బులు జమ కావడం కూడా ఆలస్యమే జరుగుతుందన్నారు జిల్లా కేంద్రంలోని 11 వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి హౌసింగ్ అధికారులు వేసిన మార్కింగ్ ను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారురాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి నిర్మాణాన్ని మధ్యలో ఆపకుండా, ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు మున్సిపల్, హౌసింగ్ అధికారులు ఎక్కడ జాప్యం లేకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. అయితే తమ వార్డుకు వచ్చిన కలెక్టర్‌తో ఆ వీధికి చెందిన పలువురు మహిళలు నీటి సమస్య తీర్చాలని మొర పెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు పాల్గొన్నారు.

### ఆదర్శ మున్సిపాలిటీగా

# వనపర్తి జిల్లా

**రూ.234కోట్లతో నియోజకవర్గం అభివృద్ధికి**

**కంకణ బద్దులమై పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



మార్నింగ్ వాక్‌లో వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, జూన్ 3 ప్రభాతవార్త :** వనపర్తి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దేందుకు కంకణ బద్దులమై పనిచేస్తున్నామని నియోజకవర్గం శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవో,తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి వనపర్తి జిల్లా కేంద్రంలోని వివేకానంద కూడలి నుండి రామాలయం వరకు మార్నింగ్ వాక్ చేపట్టారు. వ్యాపార, వాణిజ్య, సముదాయ యజమానుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన రూ.234 కోట్ల ప్రణాళికల నివేదికలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మూడు సంవత్సరాల వ్యవధిలో ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ వనపర్తి మునిపిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తామన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు,వ్యాపారం,వాణిజ్య సముదాయాల యజమానులు సహకరించాలని కోరారు.హిందూ స్మశాన వాటిక, రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు,మున్సిపాలిటీ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య

# పెరిగేలా కృషి చేయాలి

**గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, జూలై 3, ప్రభాతవార్త:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, కొత్తగా భర్తీ అయిన ఉపాధ్యాయ ఖాళీలు,నాణ్యమైన విద్యాబోధన,ఉచిత యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తున్న విషయాల గురించి ఇంటింటికి వెళ్లి విద్యార్థులు వారి తల్లిదండ్రులను మోటివేట్ చేస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో అధిక సంఖ్యలో చేర్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు,విద్యార్థులు 100 శాతం హాజరుండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బడిబాట కార్యక్రమం సంబంధించిన రిపోర్టులు అప్డేట్ చేయించి సమర్పించాల్సిందిగా మండల విద్యాధికారులకు ఆదేశించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తప్పనిసరిగా ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చేరేలా మండలాల వారీగా పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ అధికారికి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, అన్ని మండలాల విద్యాధికారులు,జిల్లా కో ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి

**కస్తూర్బా గురుకుల కళాశాలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే**



గురుకుల కళాశాలను ప్రారంభించిన ఎంపి, ఎమ్మెల్యే

**కోయిలకొండ, జూలై 3 ప్రభాతవార్త :** విద్యాభివృద్ధికి కృషి చేస్తామని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి, పాలమూరు ఎంపీ డీకే అరుణలు అన్నారు. గురువారం మండల - మిగతా4లో..

### కేజీ టు పీజీ విద్యపై

# అధ్యయనం



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తాం
- ఉన్నత విద్య బలోపేతానికి తగు సూచనలు అందజేస్తాం
- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై3, ప్రభాతవార్త:** ఉన్నత విద్యా బలోపేతంపై తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు పాలమూరు యూనివర్సిటీని మొట్టమొదటిసారిగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ వ్యవస్థలోని సమస్యలను విద్యార్థుల నుంచి వివిధ సంఘాల నాయకుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించి ఒక సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కేజీ టు పీజీ విద్యలో సమూల మార్పులకై అధ్యయనం చేస్తున్నామని, యూనివర్సిటీ స్థాయిలో గల వివిధ సమస్యల పైన ప్రత్యక్షంగా విద్యార్థుల నుంచి, మేధావుల



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. విద్యా రంగంలో వెనుకబడిన గద్వాల జిల్లాలోని గట్టు మండలాన్ని ఆధారంగా చేసుకుని పాలమూరు యూనివర్సిటీని సందర్శించామని, త్వరలో మరిన్ని యూనివర్సిటీలను సందర్శించి నివేదిక తయారు చేస్తామని అన్నారు. ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిలబస్ రూపకల్పన మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉందా లేదా అని, చాలామంది విద్యార్థులు మంచి పర్సంటేజ్ తో పాస్ అయినప్పటికీ జీవితంలో స్థిరపడడం లేదని, సమాజ అవసరాల కొరకు సిలబస్ రూపకల్పన జరగాలని, విద్యా కమిషన్ సభ్యులు యూనివర్సిటీలో సమస్యలను చర్చించి ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసి పరిష్కారంలో సహకరించాలన్నారు. అనంతరము అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థులు వివిధ సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కాలేజీలో, హాస్టల్లో క్లాస్ రూమ్‌లో కొరత ఉందని, భోజన నాణ్యతను మరింత పెంచాలని, పరిశోధన అవసరాలకు అనుగుణంగా నిధులను పెంచాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు,ప్రొఫెసర్ పి ఎల్ విశ్వేశ్వరయ్య, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి , పరీక్షలు నియంత్రణ డాక్టర్ కే ప్రవీణ,ప్రిన్సిపల్స్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, రవికాంత్, కరుణాకర్ రెడ్డి, చావ వెంకట రెడ్డి, మార్కుపోలోని ఎస్, డాక్టర్ భగవంతు రెడ్డి , వివిధ విభాగాలధిపతులు అధ్యాపకులు బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### హామీ అమలు చేయండి..

# మాట నిలబెట్టుకోండి

**ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే**

**పర్ణికా రెడ్డిని కోరిన గార్లపహాడ్ జేఏసీ సభ్యులు**



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

**మహబూబ్‌నగర్, కోయిలకొండ, జూలై 3 ప్రభాతవార్త:** గత అసెంబ్లీ ఎన్నికలలో స్థానిక ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ఎమ్మెల్యే గెలిచిన తర్వాత వెంటనే గార్లపహాడ్ మండలం చేస్తానని వాగ్దానం చేశారు. వాగ్దానాన్ని ఒకటిన్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదని వెంటనే గార్లపహాడ్ మండలం ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జేఏసీ మండల కో కన్వీనర్ వెంకటరామిరెడ్డి కోరారు. ఈ మేరకు కోయిలకొండ మండలంలోని కేజీబీవీ పాఠశాల ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంటు ఎంపీ డీకే అరుణకు జేఏసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంగం ఆంజనేయులు, కేశవాపూర్ నరేష్, పాల్గొన్నారు.

### తెలంగాణ తొలి అమరుడు

# దొడ్డి కొమురయ్య

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఎదిరలో కొమురం భీమ్ విగ్రహావిష్కరణ**



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై3 ప్రభాతవార్త:** తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగర పాలక పరిధిలోని ఎదిర కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య స్పూర్తితో గ్రామాల్లో ప్రజలు వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టారని, పన్నులు కట్టేదే లేదని తిరుగుబాటు చేశారని ఆయన గుర్తు చేశారు. దొడ్డి కొమురయ్య ఆత్మ బలిదానం వలన దేశవ్యాప్తంగా భూ సమస్యలపై చర్చ జరిగింది అని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో మన పిల్లలు కుల వృత్తితో పాటు ఏదైనా నైపుణ్య శిక్షణ పొందాలని ఆయన చెప్పారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో మన పిల్లలు ఎక్కువ మంది చేరి ఏదైనా ఒక నైపుణ్య శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, రాజకీయాల పేరుతో గ్రామాలను విచ్చిన్నం చేయరాదని హితవు పలికారు. గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి ఉమ్మడిగా గ్రామానికి ఏమేమి కావాలి అని రోడ్ మ్యాప్ వేసుకుని తన వద్దకు రావాలని అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం అని ఆయన - మిగతా4లో..

# జిల్లా అభివృద్ధికి బ్యాంకులు భాగస్వాములవ్వాలి

- రుణాల మంజూరీలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకం
- వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యతివ్వాలి
- వెనుకబడిన వర్గాల శ్రేయస్సుకు బ్యాంకులు కృషి చేయాలి
- ప్రభుత్వ పథకాలకు బ్యాంకులు పూర్తి సహకారం ఇవ్వాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విజన్ కు అనుగుణంగా బ్యాంకులు జిల్లా అభివృద్ధికి సహకరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందచేసి వారి ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించాలని ఈ విషయంలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన డిసిసి, డి.ఎల్.ఆర్.సి (బ్యాంకర్ల) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అర్హులైన వారికి అనేక సంక్షేమ పథకాల క్రింద రుణాలను మంజూరు చేస్తున్నాయని,వాటిని లబ్ధిదారులకు చేరేలా బ్యాంకర్లు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం మొదలుకొని వారికి రుణాలు అందించే వరకు బ్యాంకర్లు ఎంతో ముఖ్యభూమిక పోషిస్తారని అన్నారు. జిల్లాలో వరి సాగు ఆధారిత జిల్లాగా పేరు గాంచిన విషయం మీ అందరికీ తెలిసిందేనని, ఇందుకు అనుగుణంగా వ్యవసాయ రైతులకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ఇందిరా మహిళ శక్తి రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీలను దీంతో పాటు విద్యార్థులకు సంబంధించి వారి ఉన్నత చదువులకు విద్యారుణాలను అత్యధిక సంఖ్యలో మంజూరు చేయాలని ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు చూపకుండా ఉంటే ఎంతో వారికి మంచి భవిష్యత్తును అందించిన వారమవుతామని కలెక్టర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు - మిగతా4లో..

# రెస్క్యూ బృందాలు తనిఖీలు నిర్వహించాలి

- హోటళ్లు,మెకానిక్ షాపులు విజిట్ చేయాలి
- 31వరకు ఆపరేషన్ ముస్కాన్
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై 3,ప్రభాతవార్త:** జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రెస్క్యూ టీమ్ అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఆపరేషన్ ముస్కాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాల కార్మికులు పని చేసే ప్రాంతాల్లో వారిని గుర్తించి తీసుకున్న పునరావాస చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని హోటళ్ళు, పూల దుకాణాలు, మెకానిక్ షాపులు, నిర్మాణ రంగం, భిక్షాటన, ఇటుక బట్టీలు, ఇతర చోట్ల, ప్రమాదకర ప్రాంతాలలో పని చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో కలిసి రెస్క్యూ టీమ్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో 0 నుండి 14 సంవత్సరాల లోపు, 14 నుండి 18 సంవత్సరాల లోపు బాలలను పని లో పెట్టుకున్నా, వారిని లైంగికంగా వేధించిన అటు వంటి సంఘటనలు బాలల సంరక్షణ అధికారి కి గాని చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కి సమాచారం అందించాలని అన్నారు. జులై 1 నుండి జులై 31 వరకు వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ లో తప్పి పోయిన, నిరాదరణ కు గురైన, పని లో ఉన్న బాల కార్మికులను గుర్తించాలన్నారు. గుర్తించిన బాల కార్మికుల సంరక్షణ, వారికి విద్య అందించాలని, క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిరా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. ఎన్.బి.రత్నం, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారిణిజరీనా బేగం, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి శంకరాచారి, బాలల సంరక్షణ కమిటీ చైర్మన్ , డీసీపీఓ, రెస్క్యూ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# వేల మందికి ఇల్లు కట్టించడం పుణ్యఫలం

**ఇది నా అదృష్టంగా భావిస్తున్నా: ఎమ్మెల్యే యెన్నం**

**1437 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు పంపిణీ**

**రాబోయే రోజుల్లో మయూరి కో ఆపరేటివ్ సొసైటీ**



ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 3 ప్రభాతవార్త:** ఎప్పుడో ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఇన్ని వేల మందికి ఇండ్లు కట్టించే అదృష్టం తనకు లభించిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని శిల్పారామంలో నగరపాలక సంస్థ పరిధికి చెందిన లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ప్రొసీడింగ్స్ పత్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ మీకు ఇండ్లు మంజూరు చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. తైబజార్ రద్దు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చామని, ఎన్నికల ఫలితాలు రాగానే తైబజార్ రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఎవరి మధ్యవర్తిత్వం, దళారీ వ్యవస్థ లేకుండా, పార్టీలకు అతీతంగా అసలైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మీరు మీ కాళ్ళ మీద నిలబడి జీవించేందుకు నైపుణ్య శిక్షణ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, మహిళల కోసమే వీరన్న పేటలో రెండుమూడు రోజుల్లోగా శంకుస్థాపన చేసుకుంటామని, అలాగే రైల్వే స్టేషన్ రోడ్‌లో ఒక ట్రైనింగ్ సెంటర్ పూర్తయిందని, దానిని కూడా ప్రారంభించుకోబోతున్నామనిచెప్పారు. ఇప్పటి వరకు బికె రెడ్డి కాలనీలో కంప్యూటర్ కోర్స్‌లో వెయ్యి మందికి పైగా మా ఆడబిడ్డలు శిక్షణ పూర్తి చేసుకున్నారని గుర్తుచేశారు. రాబోయే మూడున్నర సంవత్సరాలు మహబూబ్‌నగర్ ఆడబిడ్డలకు మంచి రోజులు రాబోతున్నాయని ఆయన చెప్పారు. దానికి రుజువు ఈరోజు వందల మందికి వారి సొంతింటి కళ సాకారం చేయడమే అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మీ ఆశీర్వాదం మా మీద ఉంటుందని పూర్తి విశ్వాసము ఉందని, మీకోసం పనిచేస్తున్న మమ్మల్ని నిలబెడతారని ఆయన అన్నారు. ఇంతమంది సొంతింటి కళ నెరవేర్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించి దీవించాలని సూచించారు. మున్సిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్‌నగర్‌ను నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్‌ను మొదటి స్థానంలో నిలిపేందుకు మా ఆడబిడ్డల సహకారం వారి తోడ్పాటు అవసరమని ఆయన చెప్పారు. రెండు మూడు వారాల్లోగా రేషన్ కార్డులు లేని వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అవేజ్, ఫయాజ్, సిజె బెనహార్, అజ్మత్ అలి, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, జహీర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

**- విద్యుత్ ప్రమాదాల నుంచి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 3, ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తమ వ్యవసాయ పనుల్లో విద్యుత్‌ను ఉపయోగించేటప్పుడు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి కోరారు. వర్షాలు పడే సమయంలో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ నీరు నిలిచే అవకాశం ఉండడంతో ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. గతంలో విద్యుత్ షాక్ కారణంగా రైతులు ప్రాణాలు కోల్పోయిన దురదృష్టకర సంఘటనలు సంభవించాయి. అలాంటి ప్రమాదాలను నివారించేందుకు రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే రైతులు తమ సొంతంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా, తక్షణమే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలి లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేసి అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 ద్వారా పోలీసు సహాయం పొందవచ్చునని ఎస్పీ సూచించారు. రైతుల ప్రాణాలు అపురూపమైనవని, అందరూ తమ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

## పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ

**వెల్దండ, జూలై 3, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు "తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్" ఐక్యత ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా 8 ల్యాప్‌టాప్‌లను గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణరత్నంతో కలిసి పాఠశాలకు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బహుకరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న డిజిటల్ ప్రపంచంతో పోటీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా సన్నద్ధం కావాలని, వారికి కావాల్సి న సదుపాయాలను కల్పించి, వారిలోని ప్రతిభను ప్రోత్స హించి,వారిలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి తన వంతు ప్రయత్నంగా ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్నాని, డిజిటల్ యుగంలో విద్యార్థులు మరింత సమగ్ర మైన, మెరుగైన విద్యను పొందడానికి డిజిటల్ కంప్యూటర్ తరగతులు సహాయపడుతాయని, విద్యార్థులు కంప్యూటర్ కోడింగ్‌లాంటి తదితర కొత్తవిషయాలపై పాఠశాల దశలోనే అవగాహన కల్పించాలని, కార్పొరేట్ విద్యాలయాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందుకు సాగాలని తదనుగుణంగా తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాపాఠశాలకు ఎలాంటి సహాయం అడిగిన వెంటనే సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి స్పందించి సహాయ సహకారాలు అందిస్తున్నారని, గతంలో విద్యార్తులకు వాష్‌రూమ్స్ విషయంపై స్పందించి వెంటనే రూ.1లక్షలతో వాటికి మరమత్తులు చేయించారని, అలాగే మా విద్యార్థులుఅడిగిన వెంటనే ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందించిఅన్ని విధాలుగా మా పాఠశాలను సహాయ, సహకారాలు అందిస్తూ మా విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్స హిస్తు న్నారన్నారు. ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళితో పాటు సీనియర్ నాయకులు దశరథ్ నాయక్, లాలు నాయక్, నర్సింగ్, రమేష్, రఘు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు కొండల్‌యాదవ్,రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచిన ఉపాధ్యాయులు

**వెల్దండ, జూలై 3, ప్రభాతవార్త:** ప్రైవేటు చదువుల కన్నా ప్రభుత్వ చదువులే మిన్న అని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు. మండల కేంద్రంలోని బాలికల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రధానో పాధ్యాయులు సుగుణ, ఉపాధ్యాయ బృందం ఇల్లు ఇల్లు తిరిగి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి గత ఏడాది కన్నా మరో 20 మంది విద్యార్థులను పాఠశాలలో కొత్తగా చేర్పించారు. గురువారం పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పార్టీ ఏర్పాటు చేసి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలప్రధాన ఉపాధ్యాయులు సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అత్యుత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలోనే బోధన ఉంటుందని మన ఊరిలోని మన పాఠశాలను విద్యార్థుల సంఖ్యను పెంచుకొని నాణ్యతమైన విద్య అందించడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, మురళీధర్‌రావుతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్

**గండీడ్ ,జూలై 3, ప్రభాతవార్త;** గండీడ్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని మహబూబ్ నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్ గదిని పరిశీలించి రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మల్లికార్జున రావు, డిప్యూటీ తాసిల్దారు మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కును చెల్లించుకున్న మంత్రి వీరాఅభిమాని

**మాగనూరు,జూలై 3 ప్రభాతవార్త :** తను అభిమానించే నాయకుడుకి మంత్రి పదవి వస్తే తన ఇష్ట దైవమైన మాగనూర్ శ్రీ లక్ష్మి నరసింహస్వామికి 101 టెంకాయలను మొక్కుగా చెల్లిస్తానని మంత్రి ప్రియ శిష్యుడు మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేణు గౌడ్ మొక్కుబడి కార్యక్రమంలో భాగంగా గురువారం స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నాడు.ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి వాకిటి లలిత శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో అర్చకులు వాదిరాజ్ బన్నయ్య వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి సతీమణికి ఆలయ కమిటీ కోశాధికారి కె.కృష్ణయ్య శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, అలయ పుజారి ప్రభు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముష్టి లక్ష్మన్న, వాకిటి శ్రీనివాస్, మాజి సర్పంచ్‌రాజు, బి.రవి కుమార్, హేమసుందర్, పూజాశివు, కొత్తపల్లి నరసింహ, వర్కూర్ నరసింహ, టప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవం కోసం జర్నలిస్టుల పోరాటం

**కొల్లాపూర్, జూలై3 ప్రభాతవార్త:** కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు తీన్మార్ మల్లన్న టీం, క్యూ న్యూస్ జిల్లా ప్రతినిధి రాజశేఖర్ మద్దతు ప్రకటించారు. గురువారం తొమ్మిదోవ రోజు జరుగుతున్న మౌన దీక్ష నిరసన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ ఆత్మగౌరవ పోరాట గడ్డన్నారు. గతంలో ఎన్నో పోరాటాలు నడచిన గడ్డ కొల్లాపూర్ అని ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో మన జర్నలిస్టులు పోరాటాలు చేస్తున్నారన్నారు. పోరాటం ఎదో ఒకరిని ఉద్దేశించి చేస్తుంది కాదని ఉద్యమాలు ఎప్పుడు ఒకరి కోసము ఉండవని తమ హక్కుల కోసం ఉద్యమాలు జరుగుతాయని ఆ విధంగానే కొల్లాపూర్ నియోజకవర్గంలో పాత్రికేయా సోదరులు ఏళ్ల తరబడి నుంచి పాత్రికా రంగంలో రాణిస్తున్నారని ఇండ్ల స్థలాల కోసం ఆర్డీవో కార్యాలయంముందు రిలే నిరాహార దీక్ష చేయవలసిన సందర్భం ఏర్పడిందన్నారు. జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సమస్యను ఆత్మ గౌరవంగా తీసుకొని ఈ పోరాటాన్ని వర్షం వచ్చిన ఎన్ని ఇబ్బందులు ఎదురైన 9వ రోజు తమ పోరాటానికి కొనసాగిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా వారి హక్కులను వారు పొందాలని, కొనసాగుతున్న పోరాటంలో అన్ని సంఘాలు కూడా కలిసికట్టుగా వచ్చి ఈ పోరాటాలకు, ఈ దీక్షలకు మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా, ఏ సంఘాలు లేవన్నారు. అయినా జర్నలిస్టు సోదరులు ఏ ఒక్కరు ఉద్యమం చేసిన వారందరికీ మనం తోడు ఉండాల్సి న అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి మనం మద్దతు ఇవ్వాల్సి న అవసరం ఉందన్నారు. సామాజికవేత్తలు మాకెందుకు అనుకోవద్దనీ, ఈ పోరాటానికి మద్దతుగా దీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల పోరాటాన్ని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి ఖచ్చితంగా జర్నలిస్టుల పోరాటానికి ఫలితం రావాలని ఆకాంక్షించారు.

## గ్రామ అధ్యక్షుల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**పెబ్బేరు, జూలై 3 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలానికి చెందిన వివిధ గ్రామాల అధ్యక్షులు జులై 4వ తేదీన హైదరాబాద్ నగరంలో లాల్ బహుదూర్ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం రోజు నిర్వహించిన పత్రిక మిత్రుల సమావేశంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, ఎఐ సిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రివర్గం, ఏఐసీసీ నాయకులు, టీపీసీసీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులుఎమ్మెల్యేలు టిపిసిసి నాయకులు సీనియర్ నాయకులు పాల్గొంటారని కావున అందరు తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మార్కెట్ డైరెక్టర్లు మోతే రాములు, నరసింహనాయుడు, రామన్ గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, తిమ్మన్న గారి రాములు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన బాసు హనుమంతు నాయుడు

**గద్వాలటౌన్, జూలై 3, ప్రభాతవార్త:** జిల్లా అధనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ను గురువారం గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా వి.లక్ష్మీనారాయణకు ప్రమోషన్ వచ్చిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి,శాలువతో ఘనంగా సత్కరించి,శుభాకాంక్షలు తెలిపారు. విధంగా కే జీ బి వి పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్ వచ్చే విధంగా చూడాలని, రేషన్ కార్డు కోసం నూతనంగా అప్లేయ్ చేసుకున్న వారికి సత్వరం పూర్తిచేయాలని చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని తదితర సమస్యలను అడిషనల్ కలెక్టర్ కు వివరించి,ఆ సమస్యలను త్వరలో పరిష్కరించాలని హనుమంతుకోరారు. ఈ కార్యక్రమంలో మోనేష్,గంజిపేట రాజు,తిరుమలేష్ ,ముని మోర్య,కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై3 ప్రభాతవార్త:** మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేందుకు వసతులు కల్పిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.నాగర్‌కర్నూల్ నియోజకవర్గం తెల్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్త పరీక్షల కేంద్రంలో రక్త పరీక్షల రిపోర్టులు, రక్త నమూనాలను కలెక్టర్ పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ అంశాలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. రక్త నమూనా సేకరణ మరియు రక్త పరీక్షలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవల కొరకు వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. వైద్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. అక్కడి వైద్య సేవల గురించి తెలుసుకొని, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు.ప్రజల సమస్యలు విన్న ఆయన, ఆరోగ్య కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు ఎదురైతే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని, తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని కలెక్టర్ తెలిపినారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ జాకిర్ ఆలి, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మహిళా హత్య కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న గద్వాల డిఎస్పి మొగిలయ్య

**అయిజ,జూలై 3, ప్రభాతవార్త;** పట్టణంలోని మాల పేటలో ఈనెల 1న జరిగిన వడ్ల సరోజ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు చేదించారు. ఆమె భర్త రామాచారి కుమారుడు వినోదాచారి కలిసి హత్య చేసినట్లు గురువారం అయిజ పిఎస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పీ మొగులయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం. సరోజ కు 2001లో ధరూర్ మండల కేంద్రానికి చెందిన రామాచారి తో వివాహం జరిగింది. కొంతకాలం వారి జీవితం సవ్యంగా సాగింది. వారికి ఇద్దరు కుమారులు ఒక కూతురు పుట్టింది. సరోజ ప్రవర్తన ఇతరులతో అక్రమ సంబంధం పెట్టుకోవడం గమనించిన భర్త పలుమార్లు నచ్చ చెప్పాడు. ఆమె వినకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకొని విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో రామాచారి కర్నూలు జిల్లా కోస్గి మండలం కౌతాళం గ్రామానికి చెందిన సుజాతతో పెళ్లి చేసుకుని అక్కడే ఉంటున్నాడు. అప్పుడప్పుడు పిల్లలను చూసేందుకు వచ్చి వెళ్లేవాడని తెలిపారు. అయితే ఆమె పెద్ద కుమారుడు వినోదాచారికి పెళ్లి సంబంధాలు చూసేందుకు ప్రయత్నించగా తల్లి ప్రవర్తన సరిగా లేదని కొన్ని సంబంధాలు విడిపోయాయి. దీంతో తండ్రి కుమారుడు ఒకటయ్యారు. ఈనెల 1న కుమారుడు వినోదాచారి ఇంటి వద్ద తల్లి ఒంటరిగా ఉన్న సమయంలో తండ్రికి ఫోన్ చేసి పిలిచాడు. మధ్యాహ్నం వేళ పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో గొడవ పడి తలను గోడకు కొట్టి గొంతు నులిమి హత్య చేసి అక్కడినుండి పారిపోయారని డి.ఎస్.పి తెలిపారు మృతురాలి చిన్న తమ్ముడు నరసింహ చారి ఫిర్యాదు మేరకు శాంతినగర్ సిఐ టాటా బాబు ఐజా ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి రెండు రోజుల్లో కేసును చేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు కోర్టులో హాజరు పరిచి రిమాండ్కు తరలిస్తామన్నారు కేసును చేదించిన పోలీస్ సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే యువతతోనే సాధ్యం

**● సమస్యల పరిష్కారంలో యువత ముందుండాలి : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డి**


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 3 ప్రభాతవార్త:** మన రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే యువతతోనే సాధ్యమవుతుందని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ప్రజలుఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని రావాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు అచ్చంపేటఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో యువత ముందుండాలని అప్పుడే ఎలాంటి సమస్యలైన పరిష్కారమవుతాయని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాడే ధైర్యం, సమాజానికి సేవ చేయాలనే తపన యూత్ కాంగ్రెస్‌లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తపై ఉన్నందుకు సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి, గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను నియమించడంలో వినోద్ కుమార్ కృషి మరువలేనిదని వారు ప్రశంసించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ తరుపున నిలబడే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమ వుతుందని ప్రతి ఒక్కరు ఇప్పటినుంచే గ్రామస్థాయిలో కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తెలియజేయాల్సి న బాధ్యత యూత్ కాంగ్రెస్ పైనే ఆధారపడి ఉందన్నారు. యువతకు ఏ సహాయసహకారాలు కావాలన్నా అందించడంలో ముందుం టానని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేలను, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిని గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల్ ప్రెసిడెంట్ కోటయ్య, అసెంబ్లీ అధ్యక్షులు తిరుపతి గౌడ్, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిదల రాము, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**గద్వాలటౌన్, జూలై 3, ప్రభాతవార్త:** తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎం.ఏ. ఎల్.డి కళాశాలలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 79 గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో జూలై 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ప్రతి రోజు 50 మంది బిఎల్వోలు ఈ శిక్షణలో పాల్గొంటారని,ఇందులో ఫారం 6 (ఓటర్ల నమోదు),ఫారం 7 (పేర్ల తొలగింపు), ఫారం 8 (వివరాల సవరణ) పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనునట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. ఫారం 6ద్వారా కొత్త ఓటర్ల నమోదు,ఫారం 7 ద్వార పేర్ల తొలగింపు, ఫారం 8 ద్వారా వివరాల సవరణలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. బిఎల్ఓలు తమ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి జాబితాలో తప్పులు లేకుండా సరిదిద్దాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో గద్వాల్ తహసీల్దార్ మల్లికార్జున్,మాస్టర్ ట్రైనర్ అశోక్,నరేష్ సీనియర్ అసిస్టెంట్ నగేష్,రెవిన్యూ సిబ్బంది,బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలకు అండగా ఉంటాం


సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**మానవపాడు, జూలై 3 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలోని నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన నిర్మలకు ప్రభుత్వంనుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిఆర్ఎస్ నాయకులు కరుణ సింహారెడ్డి, పోతులపాడు మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి,ఆనందు,విజయ్, శాంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్ :** ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన అలంపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు ఎమ్మెల్యే విజయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపాలిటీఅభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఎమ్మెల్యే విజయుడుని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.మూడునెలలకోసారి వేతనాలుఇస్తున్నారని దీంతో కుటుంబ పోషణఇబ్బందికరంగా ఉందనిఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి ఈ పంచాయతీ ఆపరేటర్ల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చొరవ చూస్తామని హామీ ఇచ్చారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఎంఈఓ

**మక్తల్ టౌన్, జూలై 3 ప్రభాతవార్త:** క్రీడా పాఠశాలకు ఎంపికల్లో భాగంగా మక్తల్ మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్‌జిపి మక్తల్ పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఉపాధ్యాయురాలు దీప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మక్తల్ మండల కేంద్రంలో నారాయణపేట జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ విశ్రాంత పిఈటి గోపాలం 15 రోజులపాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో గత నెల నారాయణపేట జిల్లాలో జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి క్రీడా పాఠశాల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపీపీస్ జీపీ మక్తల్ పాఠశాలలో 4వ తరగతికి చెందిన ఈశ్వర్ వెన్నెల ఎన్నికవ్వడం జరిగిందని రాష్ట్ర సాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను మక్తల్ మండల విద్యాధికారి అనిల్ గౌడ్ శాలువాలతో సన్మానించి అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో కూడా క్రీడా ప్రతిభను చాటి విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని అనిల్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బి.దీప, కె. అశోక్, బాబు, శ్రీవిద్య, ఆర్‌కే అశోక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

**గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత**

**గద్వాలటౌన్, జూలై 3, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆర్టీసీ బస్సు లలో ప్రయాణం సురక్షితం అని, తెలంగాణ ఆర్టీసీ బస్సు లలో వివిధ తీర్థ యాత్రలకు వెళ్లేందుకు తక్కువ చార్జీలతో ప్రత్యేక బస్సు లను ఏర్పాటుచేస్తామని గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల అరవ తేదీన తొలి ఏకాదశి సందర్భంగా వరంగల్ కు ప్రత్యేక యాత్ర బస్సు బయదేరనుందని వారు తెలిపారు. ఈ బస్సు గద్వాల నుండి బయలు దేరి బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకొని, అక్కడినుండి నేరుగా వరంగల్ వెళుతున్నదన్నారు. ఓరంగల్ లో వేయి స్తంభాల గుడి, భద్రకాళి, రామప్ప తదితర దేవాలయాలను దర్శించుకోనున్నట్లు వారు తెలిపారు.ఈ యాత్రలకు పెద్దలకు 1800/, పిల్లలకు వేయి రూపాయలన్నారు. ఇవే కాక ఇంకా ప్రత్యేక టూర్ ప్యాకేజీలను వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గద్వాల డిపో నుండి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ ప్రత్యేక యాత్ర బస్సు ల నిర్వహణ కోసం విలేజ్ బస్సు ఆఫీసర్లుగా సురేష్, చంద్రశేఖర్ లతో పాటు మరికొందరిని నియమించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

**ఇటిక్యాల, జూలై3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం పూర్తిస్థాయి సమాచారం మేరకు ఇటిక్యాల పోలీసులు తనిఖీ చేయగా 6 గురు పేకాట ఆడుతుండగా ఇటికాల పోలీసులు పట్టుకున్నారు. వారి నుండి రూ.29వేల 850లు,3 బైకులను పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## 9 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

**నారాయణపేట, జూలై 3 ప్రభాతవార్త:** ఉద్యోగ కార్మిక కర్షకుల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరిగే సమ్మెను విజయవంతం చేద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నారాయణపేట ఐసిడిఎస్, సిడిపిఓ కార్యాలయంలో గురువారం రోజు సమ్మె నోటీసు అందజేశారు. నారాయణపేట ప్రాజెక్టుపరిధిలో ఉన్న అంగనవాడి టీచర్లు హెల్పర్లు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా నారాయణపేట మున్సి పల్‌లోని మున్సి పల్ మేనేజర్ హాజిమ్‌కు మెప్మా ఆర్పిలు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పిల యూని యన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య మాట్లాడారు. ఆర్పీలకు కనీస వేతనం రూ. 26 వేల వేతనం ఇవ్వాలని దేవ భద్రత కల్పించా లని తదితర డిమాండ్లతో జూలై 9న దేశభక్తి సమ్మెలో పాల్గొన నున్నట్లు ఆమె తెలిపారు.ఈ సమ్మె నోటీసు ఆయా కార్యాల యంలో అందజేసిన వారిలో అనిత, సుమిత్ర, రామలింగమ్మ తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**ఉట్కూరు, జూలై 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఊట్కూరు మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని డా. సంతోషి సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. అదే విధంగా ఆమె తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, వివిధ రికార్డులను పరిశీలించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని తహశీల్దార్ చింతారవికి సూచనలు ఇచ్చారు.బాలికలఉన్నత పాఠశాలనుసందర్శించి, విద్యా ప్రమాణాల గురించితెలుసుకోవడానికి మెనూ ప్రకారం ఉచిత మధ్యాహ్న భోజనం అందించడానికి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.

## ధ్యానంతో ప్రతికణం పునరుత్తేజం

**- పీయూ వీసీ జిఎన్ శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై3, ప్రభాతవార్త:** ధ్యానం ద్వారా శరీరాన్ని ప్రతి కణం పునరుత్తేజితం చెందుతుందని, కన్హా శాంతి వనం మరో కొత్త ప్రపంచమని పీయూ వీసీ జిఎన్ శ్రీనివాస్ అన్నారు.పాలమూరు యూనివర్సిటీలో ఫార్మసీ ఆడిటోరియం లో ఎన్ఎస్ఎస్ సెల్,కన్హా శాంతి వనం ఇన్స్టిట్యూట్‌లు సంయుక్తంగా హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకులపతి హాజరై మాట్లాడారు. రోజువారీ దైనందిన జీవితంలో బిజీగా ఉన్న ఉద్యోగులకు విద్యార్థులకు మహిళలకు ఉపశమనం కలగాలంటే ప్రతి రోజు మెడిటేషన్ చేయాలని, శ్వాస మీద ధ్యాస పెట్టడమే ధ్యాన మన్నారు. ముఖ్య వక్త కృష్ణారావు మాట్లాడుతూ ధ్యానము భారతీయ సంస్కృతిలోఅంతర్భాగమని, ప్రతి ఒక్కరూ ధ్యానం ను అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, కన్వీనర్ డాక్టర్ చంద్ర కిరణ్, కో కన్వీనర్ డాక్టర్ కేప్రవీణ, ప్రోగ్రామ్ అధికారులు, హార్ట్‌ఫుల్ ఫౌండేషన్ ప్రతినిధులు రామ్ రెడ్డి,మోహన్, అధ్యాపకులు అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకై దరఖాస్తు చేసుకొండి

**గద్వాలటౌన్, జూలై3, ప్రభాతవార్త:**2025-26 విద్యా సంవత్సరానికి జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి (బాలురు), మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ లోని టీ.జి.ఆర్. గురుకుల పాఠశాల కళాశాల 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఉన్న మిగిలిన ఖాళీ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థినీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.ప్రవీణ్ కుమార్,తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాస్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 03 (బుధవారం) నుండి 07వ తేదీ (సోమవారం) వరకు ఉదయం10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే పనిదినాల్లో సంబంధిత పాఠశాలల్లో స్వయంగా అందజేయాలని అన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి ప్రస్తుతం చదువుచున్న తరగతికి సంబంధించిన బోనాఫైడ్ సర్టిఫికెట్,రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా జతపరచాలనిఅన్నారు.ప్రవేశ పరీక్ష 09.07.2025 (గురువారం) ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు టీ.జి.ఆర్. స్కూల్ జూనియర్ కళాశాల (బాలికల ), బాలానగర్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు.పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థుల ఎంపికను మెరిట్ ఆధారంగా నిర్వహించి, ఖాళీ సీట్లను కేటాయిస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం బీచుపల్లి (బాయ్స్)8106963904,బాలానగర్(బాలికలు) 9951149909 పాఠశాలలను సంప్రదించవచ్చని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తెలంగాణ గురుకుల విద్యా సంస్థలలో చదివి ఉత్తమ భవిష్యత్తు సాధించగలరని తెలియజేశారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

**బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూర్ రాములు**

**నారాయణపేట టౌన్, జూలై 3 ప్రభాతవార్త :** నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు వేపూర్ రాములు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు ఏళ్ళు అవుతున్న చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. నియోజక వర్గంలో కానీ నారాయణపేట మండలంలో కానీ ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పనులు చేయలేదనీ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ ఆర్ రెడ్డి తీసుకువచ్చిన పనులనే నేడు ఎమ్మెల్యే కొత్తగా శిలాఫలకాలు వేసి ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కోటకొండ మండల ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు.ఇచ్చిన హామీ మేరకు వెంటనే కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.69 జిఒ కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా చిత్తశుద్ధి ఉంటే నారాయణపేట మండలంలోని ప్రతి గ్రామానికి సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

